దక్షయజ్ఞం

"నేనే సార్ పెంటయ్యను. అవును. అలియాస్ ప్రవీణ్. నిజమే సార్.

నా బతుకంతా పొగ చూరింది. ఈ బతుకులో యిక నిప్పురాదు. ఈ శరీరం బూడిద కాదు. నా బతుకు గుడిసె మొత్తం పొగ చూరిపోయింది. ఇంతంత వంటకు పిడుకల పొగతో యిల్లంతా పొగచూరిపోయింది. ఈ రెక్కలు చూడండి సార్. ఈ బరిబద్ద బొక్కలు చూడండి సార్. ముత్తెమంత వెలుగు కోసం నా యిల్లంతా పొగ చూరిపోయింది. నా బతుకు కాటికి కాకుండా పోయింది. ఇంటికి కాకుండా పోయింది. నాకు ఈ బతుకు మీదే రోసిపోయింది సార్. ఈ శరీరంలో జీవితంలో ఏం మిగిల్చారు సార్.

ఇయ్యాల్ల మీకు దయ గలిగింది. మీకు దయగలిగే సరికి నా గుండె ఎండిపోయింది. నా పొలం ఎండిపోయింది. నా బతుకు ఎండిపోయింది. నా బాధ ఎండిపోయి వరుగులైపోయింది. ఏడ్వడానికి కన్నీళ్ళు లేవు. మాట్లాడ్డానికి భాష లేదు. ఇప్పుడు మీకు నా మీద దయగలిగింది సార్.

ఏం జరిగిందో ఇప్పుడు చెప్పుమని అడుగుతున్నారు సార్. మీదేం తప్పులేదు. నాదే తప్పు. నేను మీ చేతికి చిక్కుడే తప్పు. మీరు అడిగే స్థితిలో నేను చెప్పే స్థితిలో ఉండడమే తప్పు. నా మనస్సు న్యాయం కోసం అని చిక్కుల్లో పడడమే తప్పు. నా ఆలోచనాల్లో పడి బతుకు రోసి చచ్చిపోవాలనుకొని చావురాక మీకు చిక్కడమే తప్పు. ఉన్న నిజం చెప్పలేక చిక్కుల్లో పడడమే తప్పు. మీదేం తప్పుకాదు సార్.

మీదేం తప్పుకాదు. తెల్లారి లేస్తే మీకెన్నో పనులు మీకు ఎన్నో కేసులు. మీకు ఎన్నో సెలవులు. నా ఏడ్పు వినే తీరిక మీకు యిప్పుడు దొరికింది. మీరు ఏడువు మన్నప్పుడు ఏడ్చుటానికి నేను వేషాలు వేసే నటున్ని కాదు సార్. మీరు వినాలని దయ చూపేలోపే నా ఏడుపు ఎండిపోయింది సార్.

సరిగ్గా రెండు సంవత్సరాల మూడు నెలలకు నా కేసు వినడానికి మీకు తీరింది. ఈలోపు యిదేం బతుకురా అని ఏడ్సి ఏడ్సి మా నాయిన్న చచ్చిపోయాడు. మీరు నాకు బేల్ యిచ్చే లోపలే చచ్చిపోయాడు. తలకొరివి పెట్టటానికని శవం రెండు రోజులు యింట్లోనే మురిగిపోయినాక మీరు బేల్ యిచ్చారు సార్.

నన్ను మీరు ఆ రోజు నా మొకమైనా చూడకుండానే జైలుకు పంపారు. యాదికి ఉందా సార్ మీకు. ఏమైనా చెప్పుకునేదున్నదా అని ఆ రోజు అడగలేదు మీరు. ఆ రోజు యిట్లా అడిగి ఉంటే బురుదలో దుంకిన రాయిలా అయ్యేవి మీ కాగితాలు. అప్పుడు నా హృదయం బురద బురదగా ఎవరు పెల్లగించినా మీద చిల్లేదిగా ఉండేది. మీకు బాధ తెల్సు. బతుకు తెల్సు. మీకు మీ బతుకు బాధ తెల్వకపోతే అప్పుడడగడం మానేసి యిప్పుడెందుకు అడుగుతారు సార్.

మీకు అన్నీ తెల్సు సార్. తెల్సీ మల్లా నా నోటినుంచి చెప్పించాలనుకుంటున్నారు. నా బతుకును మల్లా నానోటి నుండి రప్పించాలనుకుంటున్నారు. నా కథ మల్లా చెప్పించాలను కుంటున్నారు. నాకు

కథలు చెప్పడం రాదు సార్. నేను చచ్చిపోవాలనుకున్నది నిజమే. దానిగ్గల కారణాలను యిపుడు చెప్పుమంటే మనిషి గుండె ఎండిపోయినాక వేదాంతంతో తప్ప వేదనతో ఎట్లా చెప్పగలను సార్.

ఎందుకంటే కాలం గడిచిన కొద్దీ అవసరాలు గతించి అనుభూతులు మిగిలిపోతాయి సార్. అనుభవాల వివరాలు అదృశ్యమై దృక్పథాలుగా కొనసాగుతాయి. ఆ ముద్రలు జీవిత దర్శనాలు సరైనవో కావో యిపుడు తెలియవు సార్. తెల్సుకోవాలంటే ఆ వివరాల్లోకి వెళ్ళాలి. అనుభూతులను, దృక్పథాలను అవి రూపొందిన అనుభవాల్లోకి తిరిగి అనువదించుకోవాలి సార్. అది చారిత్రక సినిమా కోసం ఆనాటి జీవితాల్ని సంస్కృతిని తిరిగి సృష్టించుకోవడం వంటిది సార్. అది కష్టం సార్.

మీరేమీ అనుకోకపోతే ఒకమాట అడుగుతాను సార్. ఆ రోజు రాత్రి ఎనిమిదిన్నరకు నన్ను మీ యింటికి తెచ్చారు. మీరు భోం చేస్తున్నారంటే మమ్ములను బయటనే నిలబెట్టారు. మీరు తువ్వాలుతో మూతి తుడుచుకొని సోఫాలాంటి కుర్చీలో కూర్చున్నారు. మా వెంట వచ్చిన పోలీసు మీకు ఏవో కాగితాలు యిచ్చాడు. మీరు వాటిని చదివినారో లేదో, సంతకాలు పెట్టినారు. నన్ను మీరు దూరం నుంచే చూశారు. మీరు లోపలికి వెళ్ళిపోయారు. ఆ రాత్రి నన్ను తీసుకపోయి మల్లా అదే లాకప్పులో వేశారు.

ఆరోజు నేను మీ ఎదుట హాజరుపరుచబడ్డ రోజు. సెప్టెంబరు యిరవై మూడో తేది రాత్రి ఎనిమిది గంటలు. ఈదురు గాలి. కరెంటు పోయింది. వర్షం పడుతున్నది. ఆ రోజు రాత్రి మీరు ఏ కూరతో అన్నం తిన్నారు సార్. ఎన్ని ముద్దలు తిన్నారు సార్. ఆ రోజు భోజనం టేబుల్ కాన్నుంచి నన్ను చూసుటానికి మీరు వేసిన అడుగులెన్ని సార్. ఏ కాలు ముందు వేసారు సార్. ఆ రోజు మీ యింట్లో పనిమనిషి ఎన్ని గంటలకు యింటికి పోయింది. మీ తెల్ల బొచ్చుకుక్క ఎన్నింటికి నిద్రబోయింది. ఆ రాత్రి గాలి ఈదురుతో వర్షం పడింది. కరెంటు పోయింది. అప్పుడు ఫ్యాన్ ఆగిపోయి మీకు ఎన్ని దోమలు కుట్టినై సార్.

ఇవన్నీ మీరు లెక్కకట్టి చెప్పగలరేమోగానీ నా కష్టాల్ని వివరంగా లెక్కలు తీసి చెప్పలేను సార్. లాకప్పులో మూత్రం వాసన ఎన్ని రోజులు పీల్చానో చెప్పుమంటే చెప్పగలను. ఏ పూట ఎలాంటి తిండి పెట్టారో చెప్పగలను. ఎవరి మీద ఎందుకు ఎన్ని కేసులు బనాయించారో చెప్పుమంటే చెప్పగలను. కాని నేనెందుకు చచ్చిపోవాలనుకున్నానో చెప్పుమంటే చెప్పలేను సార్. రోజూ చచ్చిపోవటానికి చచ్చిపోయేన్ని కారణాలు ఉన్నాంక ఏ రోజు కారణాలని గుర్తుంచుకోవాలె సార్. ఏ ఏ కారణాలని గుర్తుంచుకోవాలె సార్.

ఒక్కమాటలో చెప్పుమంటే చెప్తాను సార్. నా పేదరికమే నా చావుకు కారణం సార్. నా అజ్ఞానమే నా చావుకు కారణం. నా పేద కులపు జన్మే నా చావుకు కారణం. మేకను చూస్తే బ్రహ్మకు కూడా కోసుక తినబుద్ధి అయిందట సార్. అందరూ నన్ను కోసుక తినాలను కుంటున్నారు. నా బతుక్కు ఏదైనా మార్గం చూడండి అని బ్రహ్మదేవునికి మేక మొరపెట్టు కున్నదట. నిన్ను చూస్తుంటే.... నీ మెత్తదనం చూస్తుంటే నాక్కూడా నిన్ను కోసుక తినబుద్ధి అవుతున్నది అని బ్రహ్మదేవుడు నవ్వినాడట సార్. మా బతుకులు మేక బతుకులు సార్. పులికేకాదు తోటిమనిషికి కూడా మమ్ముల చూడగానే కోసుక తినాలనిపిస్తుంది సార్.

మమ్ములను మొత్తం కోసుక తిన్నా మంచిగనే ఉండు. అలాల్ చేసేటప్పుడు నరం తెంపి వదిలేసినట్టు.... మా రక్తమంతా కారిపోయి.... మా కోరికలన్నీ ఉడిగి రాలిపోయేట్టు మా జీవితాల్ని కొంచెం కోసి వదిలేస్తారుసార్. నాకు మల్లా బతుకునివ్వడం కోసం జైల్లో పెట్టాననుకున్నారు మీరు. మాకు బతుకునీయడం కోసమే చచ్చిపోకూడదనే చట్టం చేసినట్టున్నారు. కాని మీకు తెల్సా సార్. మీ ఉదాత్త హృదయం మమ్మల్ని బతికిస్తూ చంపుక తింటున్నది.

ఆ రోజు లాకప్‌లో వారం ఉంచుకున్నాక రాత్రి ఎనిమిది తర్వాతే నన్ను మీ దగ్గరకు ఎందుకు తెచ్చారనుకుంటున్నారు. మరుసటి రోజు ఉదయం ఎందుకు తేవాలనుకోలేదు వాళ్ళు. కోర్టులో అందరి ముందు హాజరుపరిస్తే ఆవేదనతో అన్నీ చెప్పేస్తానని వాళ్ళ భయం సార్. వారం రోజులు లాకప్పులో ఉంచి చిత్రహింసలు పెట్టారు. పోలీసోళ్ల చిత్రహింసలు భరించలేక చచ్చిపోదామనుకున్న మాట చెప్పవద్దని మల్లా కొట్టారు. ఆ హింసలు చూడలేక మూడు వేలు అప్పు తెచ్చి వాళ్ళ చేతుల్లో పోశారు మావాళ్ళు. అదంతా పోనీయండి సార్. అసలు కథ టూకీగా చెప్తాను సార్....

★ ★ ★

"మా తండ్రికి మేం నలుగురం సంతానం సార్. మా అక్కకు చిన్నపుడే పెళ్ళయి పోయింది. చెల్లెలు మాలచ్మికి మూడేళ్ళ వయస్సులో అమ్మ పోయింది. కొంతకాలానికి నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆమె తనకన్నా చిన్నవాడైన ఆనందరావుకు అలవాటైంది. ఇంత మందిని సాదలేనని ఆమె రెండేళ్ళకే వెళ్ళిపోయింది. ఆనందరావు తన పెళ్ళయ్యేదాకా ఆమెను ఉంచుకున్నాడు. ఆ తర్వాత ఆమె బతుకు ఆమెదైపోయింది సార్.

"......ఈ కారణంగా మా అక్కను బావను కొంతకాలం యిల్లరికంలా తీసుకొచ్చాడు నాన్న.... సరిపడక కొన్నేళ్ళకే వాళ్ళు వెళ్ళిపోయారు.... ఆనందరావు అక్కమీద కన్నేశాడని ఆ తర్వాత తెల్సింది..... ఇంట్లో ఆడతోడు అవసరం అని భావించాడు నాన్న. నాకలా చిన్న వయస్సులో పెళ్ళయింది సార్.

"..... నాకు యిరవై అయిదేళ్ళు వచ్చేటప్పటికే ముగ్గురు పిల్లల తండ్రినయ్యాను. అప్పటి నా భార్య నర్సవ్వకు యిరవై ఏళ్ళే... పన్నెండో ఏట నుండే ఆ యింటి భారమంతా నర్సవ్వ మీదే పడింది. ఇరవై ఏళ్ళకే నలభయి ఏళ్ళ వయస్సు వచ్చేసింది.... మా తమ్ముడు అయిదో తరగతితో చదువు ఆపేశాడు. చెల్లెలు మాలచ్మి తరం నుండి మా పల్లెల్లో పెళ్ళి చేసే వయస్సు పెరుగుతూ వచ్చింది సార్.

"......ఆనందరావు నర్సవ్వను కూడా వదిలిపెట్టలేదు సార్. అప్పటికి అతనికి పెళ్ళయింది. అప్సరస అంత అందమైన దొర్సాని అతని కుండగా ఎండిపోయిన చేపలా ఎముకలు తేలి చెమటకంపు కొట్టే నర్సవ్వ మీద కన్నెందుకు పడిందో.... తెలియదు. అంతకన్నా విచిత్రం ఆరడుగుల అందగాడు ఆనందరావుండగా దొర్సాని నాపై కన్నేయడం..... పై స్థాయివారితో అక్రమ సంబంధం స్త్రీకైనా, పురుషుడికైనా ఎంత ఆత్మవిశ్వాసాన్నిస్తుందో.... సార్!

".....మంచివాళ్ళు తొందరగా పోతారంటారు. ప్రభాకర్ మంచివాడు సార్. తొందరగా పోయాడు. మాకు ప్రపంచాన్ని పరిచయం చేసిపోయాడు. పోయేనాటికి ముప్పయి ఏళ్ళయినా ఉండవు. అతను యింటి కొచ్చినప్పుడల్లా అందర్నీ పేరుపేరునా పలకరిస్తాడు. చదివింది అయి.టి.అయి. అయినా లోకాన్ని చదివేసిన విశ్వాసం అతని నవ్వులో....."

".....అతడిని చూస్తే చాలు అన్ని కష్టాలు తీరినట్లుగా ఉండేది. మంచి బతుకు పోరాడైనా గెల్చుకోవాలనే ఆశ ఆర్తి కలిగేది. అతని నవ్వులో.... అతని మాటల్లో ఏదో శక్తి ఉంది... అలా పరిచయమయ్యాయి రాజకీయాలు.... వివరాలు గుర్తులేవు.... సభలు.... ఊరేగింపులు.... పాటలు... జెండాలు పాతడం...."

"..... ఆ తర్వాత కొద్దికాలానికే పరిస్థితి మారిపోయింది. ప్రభాకర్ కనుమరుగయ్యాడు. అతని దర్శనమే మహాభాగ్యం అయిపోయింది. అతని జాడ కోసం నీళ్ళను వడపోశారు.... చెరువును వడపోయడం ఎవరితరం...."

".....సార్ వాళ్ళు దొరక్కపోతే వీళ్ళకు జరిగే నష్టం ఏమీ లేదు. కాని చట్టానికి తన పెద్దరికం పోతున్నదని అసహనం పెరిగింది.... అసహనం శాడిజంగా మారింది. క్రూరత్వం పడగవిప్పింది. పశుత్వం

రాజ్యమేలింది.... అతడు దొరకలేదు. అతన్ని దొరక్కుండా కాపాడుతున్నారని కసి.... అత్తమీది కోపం దుత్తమీద....."

".....అలా ఎందరో ఇంటి నుండి లాకప్పుకు..... లాకప్పునుండి కోర్టుకు.... కోర్టు నుండి జైలుకు..... జైలులోపాలాలు.... జైలు నుండి బేల్‌పై యింటికి.... ఇంటినుండి కేసుకోసం కోర్టు హాజరు.... కేసు కేసుకూ..... వాయిదా నుండి మరో వాయిదాకు నడుమ మారే మా బతుకుల తీరు గురించి ఏ రికార్డుల్లో ఉండదు. ప్రతి కేసులో గలవారి గురించిన ఈ వివరాలు రాసుకుని ఎంక్వయిరీ కమిషన్లేసి చట్టం అమలయ్యే తీరును లోలోతుల్లోకి వెళ్ళి పరిశీలించి ఎప్పటికప్పుడు సరిచేసుకొనే విధానం ఉంటే యిన్ని సమస్యలు ఉండకపోను సార్. ఒక్కమాట అడుగుతాను సార్. ఏమనుకోవద్దు. మేం ఎన్నిసార్ల కేసులకొచ్చినా కేసులు వాయిదా పడుడేగద. నాలుగుసార్ల రాకపోతే మీకు జరిగిన నష్టమేంది. మీదెంత దయగల హృదయం సార్! ఎన్నిసార్లు వచ్చినా కేసు వాయిదా వేసుడే అని తెల్సీ నేను రాలేకపోయినందుకు బేల్ క్యాన్సిల్ చేసి జైల్లో వేస్తిరి! దొరా! మీరు మా పెద్దొరకన్న పెద్దదొరలు. మీ గీతకు తిరుగుండది. ఆ పెద్దొర ఆలస్యమైతే అవ్వనక్కను తిట్టి మర్సిపోవు. కాని మీరు చల్లగా మాట్లాడుతూనే జేల్లోకి పంపుతారు. చట్టాలు మీ చేతిలోని బంగారం మీరెట్లా చెప్తే అట్లా వింటాయి సార్."

".....ఈ బాధలు పడలేక యిల్లు వదిలాను.... నేను అడవులు పట్టేనాటికే నాకు ముగ్గురు పిల్లలు. మాలచ్మి జొన్నకర్రలా పెరుగుతోంది.... తమ్ముడు కరెంటు మోటార్ల రిపేరింగ్ నేర్చుకొని కొంత సంపాదించడం మొదలెట్టాడు.... నన్ను సర్పంచుగా నిలబడాలన్నారు.... నాకూ అదే ఆలోచన ఉండింది.... చిన్న కులంలో పుట్టడం ద్వారా కోల్పోయిన గౌరవం తిరిగి పొందడానికి అది కూడా ఒక సాధనం అనే విశ్వసించాను.... అయితే మీరు పెట్టే తిప్పలు చిత్రహింసలు యిల్లుకన్నా అడవులు పట్టడమే సుఖం అనుకునేట్టు చేసింది. ఇల్లువదిలి ఎన్ని ఊర్లు తిరిగానో.... ఎన్ని అనుభవాలో.... ఎంత ప్రేమో.... ఆ అనుభవాల్తో నిలబడగలిగి ఉంటే సునాయాసంగా ఎమ్మెల్లేగా గెలిచి ఉండేవాడిని.... టగ్గాఫర్‌గా నిలబడి ఉంటే ప్రభాకర్ పార్లమెంటు సభ్యుడై ఉండేవాడు సార్.

"....న్యాయమూర్తిగారూ...! అవన్నీ పాలకవర్గ రాజకీయాలనుకున్నాం.... పాలకవర్గాలక్కూడా శాసనాధికారం.... చట్టబద్ధత ఈ ఎన్నికల ద్వారానే వస్తుందని అపుడు మాకు తెలియదు.... కాన్షీరాం వచ్చి చెప్పేదాకా ఈ విషయం అంబేద్కర్ చెప్పాడని కూడా తెలియదు సార్. దాంతో పార్లమెంటునే గడగడలాడించాల్సిన ప్రభాకర్ ఎన్‌కౌంటర్లో పోయాడు... ఏ అధికారాన్ని ఎన్నికల్ని గుర్తించ నిరాకరించామో వాటి ద్వారానే నిర్బంధాలకు గురయ్యాం.... జీవితాల్ని ఓడిపోయే వ్యూహం ఎత్తుగడలకు నాంది అక్కడే పడింది.... అది సమర్థుల్ని అసమర్థుల్ని చేసింది. తాను సృష్టించుకున్న నిర్బంధాలకు తానే భయపడేట్టు చేసింది.... పోయి..... పోయి... ఇపుడు ఆకురాలినా భయమే..... స్వేచ్ఛగా మాట్లాడుకోవాలన్నా భయమే.... చివరకు ప్రజల్ని... సన్నిహితుల్ని నమ్మాలన్నా భయమే.... అన్నిటి మీదా నిఘా.... అనుమానం.... టెన్షన్స్..... అల్సర్స్.... కోపం... అసహనం... రహస్యంలో తప్పుడు సమాచారం.... అంతా అస్తవ్యస్తం..... ఒక పద్ధతి ప్రకారం జరిగిపోయింది... ఆ పద్ధతిని రూపొందించినవాళ్ళు పార్టీలో తమ అధికారం పోగానే హాయిగా ఎంచక్కా భార్యా పిల్లల్తో.... మనుమరాళ్ళతో కాలం గడుపుతున్నారు.... వాళ్ళు మళ్ళీ విప్లవం అని ఊసెత్తితే ఒట్టు.... అలాంటివాళ్ళను నమ్ముకొని ముందటపడి మూతి పళ్ళు రాలగొట్టుకున్నవాళ్ళల్లో నేనొకరిని సార్.

★ ★ ★

"..... మీకా విషయం తెలియదు. అందులో ఉండే ఆనందం ఉత్తేజం మీకు తెలియదు... అడవుల్లో చెట్ల కింద కూర్చుని ఈ ప్రపంచాన్ని మారుస్తామని చర్చలు చేస్తుంటే కలిగే ఆనందం

ఆత్మవిశ్వాసం మీ ఊహకు అందదు.... పల్లెల్లో.... గూడెంలల్లో గుడిసెల్లో గుడ్డి దీపం వెలుగులో... మా మాటల్తో వాళ్లకు బతుకుమీద విశ్వాసం కలుగుతుంటే... ఎండిన చాపల్లాంటి ఆ శరీరాల్లో... మాసిపోయిన ముఖాల్లో రాసిపోసినట్టు ఆశలు చైతన్యం కదలాడుతుంటే... మనిషైన వాడెవడికైనా వారికోసం ప్రాణాలీయాలనే అన్పిస్తుంది.... నా భార్య నర్సవ్వ పొద్దుల్తో ఉన్నప్పుడు ఈ ప్రపంచాన్ని మోస్తున్నది నా కడుపులోనే కదా అన్నట్టు నిండుగా నవ్వే ఆ నవ్వు చూస్తే నాక్కొంచెం ఈర్ష్య కలిగేది. మేం ఈ ప్రపంచాన్ని మారుస్తున్నాం అనే భావన మాలో ఈ ప్రపంచాన్ని మోస్తున్నది మేమే అనే ఆత్మవిశ్వాసాన్నిచ్చింది.... విప్లవంలో గల ఈ సుఖం.... ఆత్మవిశ్వాసం వల్లే ఎన్ని బాధలైనా పడడం సాధ్యపడింది..;

"....నాకప్పెల్లి సారవ్వది ఎంత చక్కని గొంతు... ఆమె పార్టీలోకి రావడానికి ఎంత కృషి చేశానో.... ఆమె చాలా తటపటాయించింది... కానీ చేరాక చకచకా ఎదిగిపోయింది. ఆమె కారణంగా నాకు మళ్ళీ పెళ్ళి చేసికోవాలనే ధ్యాస కలిగింది. ఆమెను ప్రేమించడం ప్రారంభించాను. ఇంటివద్ద పెళ్ళాం పిల్లలు ఉండగా పార్టీలో మరో పెళ్ళాం కావాలా అని కొందరు ఈసడిస్తారు.... పార్టీలో కూడా ఎవరితో చెప్పుకోలేని మానసిక ఏకాకితనం తాలూకు జీవితం కూడా ఉంటుంది.... చెప్పుకోవడానికి మనిషంటూ తోడులేని జీవితం కన్నా నరకం ఉండదు.... ఆ స్థితిలో మరో తోడు కోసం మనిషి అభిలషిస్తాడు సార్!...."

.....కాని సారవ్వ ప్రేమకు నేను ఆనలేదు. ఆమె పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌ను ప్రేమించింది. పెళ్ళి చేసుకొంది. నేను హతాశున్నయ్యాను... కోలుకోలేకపోయాను.... ఆమె మనిషిని ప్రేమించలేదు.... ఆమె అతని పదవిని హోదాను ప్రేమించింది.... బాధతో ఉండబట్టలేక పెళ్ళయ్యాక ఏడాదికి సారవ్వతో ఈమాటే అన్నాను.... ఆమె నవ్వింది.... నవ్వుతూనే నన్ను నిలేసింది... అతను నీకన్నా ఎందులో తక్కువ.... చదువులోనా.... అందంలోనా.... కమిట్‌మెంట్‌లోనా.... త్యాగంలోనా... అని అంది. నిజమే.... అతడు నాకన్నా సంస్కారవంతుడు.... బాగా చదువుకున్నాడు.... ఆ చదువు అతని ముఖంలో ఒక చెప్పలేని కళాకాంతుల్ని ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది.... అతనికి భాష వస్తుంది. అనుకున్న భావాన్ని చెప్పడం వస్తుంది...

".....ఒక టీచర్ కొడుకు అతడు.... ఒక రైతుకూలీ బిడ్డను నేను.... నాకా సౌందర్యం సంస్కృతీ తెలియవు.... ఆమెకు కావాల్సినవేవో అడగక ముందే సమకూర్చి ఆమె ప్రేమను గెల్చుకోవాలనుకున్నాను... గెల్చుకున్నాను కూడా.... అయితే సొంత అన్నయ్యలా చూసుకుంటానంది సారవ్వ.... నిజంగా చివరిదాకా సొంత చెల్లెలులాగే నన్ను చూసుకుంది. అడవి దోమల్తో ఎన్నిసార్లు మలేరియాతో తీసుకున్నా.... అన్నయ్యా అంటూ అన్నీ సమకూర్చింది సారవ్వ.... ఎక్కడెక్కడి నీళ్లో తాగి అడవుల్లో అమీబియాసిస్ కడుపునొప్పితో బాధపడ్తుంటే సారవ్వ ఎంత విలవిల్లాడేదో.... చెట్టుకింద నిద్రపోయిన నన్ను కాపాడ్డం కోసం సెంట్రీ చేస్తున్న వెంకన్న తానే బలి అయ్యాడు... అక్కడ ఎన్నో కష్టాలు... ఆ కష్టాల్లోనూ ఎంతో సుఖం ఉండేది... ఆ సుఖంలో దృక్పథం ఉండేది. మా దృక్పథంలో భాగంగా ఆ సుఖం ఉండేది...."

"....నా దృక్పథం మా వాళ్ళ జీవితాలకు సంబంధించింది... పట్నంలో, కోస్తాలో విప్లవం గురించి మాట్లాడే మేధావులు రచయితలు ఎట్లా స్వేచ్ఛగా బతుకుతూ మంచి జీవితం జీవిస్తున్నారో... పల్లెల్లో మా వాళ్ళూ విప్లవం చేస్తూనే అలా స్వేచ్ఛగా మంచిగ జీవించే విధంగా రాజీ.... శాంతి కాలంగా... వ్యూహం ఎత్తుగడలు కార్యక్రమాలు మార్చుకోవాలని నా ఆశ ఆర్తి.... నా కులం నా పుటుక నేను పుట్టి పెరిగిన బాల్యం.... అనుభవాలు నాకలా అన్పించాయి.... నాకెందుకలా అన్పించిందో.... కొంచెం చరిత్రలోకి వెళ్తేగానీ అర్థం కాదు న్యాయమూర్తి గారూ....."

"....మీకు తెల్సే ఉంటుంది.... చరిత్ర కందని కాలంలో గిరిజన తెగలు ఎక్కడికక్కడ వలసల్ని మాని స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నాయని.... వ్యవసాయం చేయడం నేర్చుకున్నాక స్థిర జీవితం అవసరమైందని. వ్యవసాయం కోసం అడవుల్ని నరికి సాగుచేశారని, వ్యవసాయం ఆధారంగా వృత్తులు ఎదిగాయని.... అదంతా పాత కథ...."

"....పాతపల్లెల్లో వెలివేయబడ్డవాళ్ళు బతుకు కోల్పోయిన వాళ్ళు... అడవులు పట్టి చిన్న గూడేలు ఏర్పర్చుకొని మళ్ళీ కొత్త అడవిని నరికి సాగు చేసికోవడం మొదలెట్టారు. అట్లా వలసలు సాగిన గిరిజనులు మాలమాదిగ యానాదులు కొత్త కొత్త ఊళ్ళను రూపొందించు కున్నారు.... చెరువులు, కుంటలు నిర్మించుకున్నారు... పోను పోను పాత ఊళ్ళల్లో బతుకు కోల్పోయిన చేతివృత్తి కులాల యువతరాలవాళ్ళు ఆ కొత్త ఊళ్ళకు చేరేవాళ్ళు.... వ్యాపారం కోసం కోమట్లు... పన్నులకోసం జాగీర్దారుల పట్వారీ గుమాస్తాలు చేరేవాళ్ళు.... వీళ్ళ కోసం బ్రాహ్మణుడు చేరేవాడు.... క్రమంగా ఊరేవాళ్ళదైపోయేది. పన్నుల కిందా, వస్తుమారకం, బాకీల కింద పొలాలన్నీ వాళ్ళ చేతిల్లోకే చేరిపోయేవి... మళ్ళీ అక్కన్నించి కొందరు గిరిజనులు... యానాది మాలమాదిగలు కొత్త అడవుల్ని సాగుచేసికోవడానికి వలసవెళ్ళే వాళ్ళు...."

"....బహుశా వందయాభయి రెండు వందల ఏళ్ళ క్రితం ఈ కరీంనగర్ జిల్లాకు అటువైపు కరువుల వల్ల కొందరు పొట్ట చేతపట్టుకొని బతకడానికి వచ్చారు. అవి కాటన్ దొర ప్రాజెక్టులు కట్టడానికి ముందే వచ్చిన కరువులై వుంటాయి. మాముత్తాత చెప్పేవాడు... ఆ వచ్చినవాళ్ళు బుడ్డగోచితో మూటెడు సామానైనా లేకుండా వచ్చారని. అలా ఒకర్ని చూసి ఒకరు వారి బంధువుల వలస సాగేది...."

"....ఆ కాలంలో యాభయి రూపాయలకు ఎకరం మంచి భూమి... మా తాత కాలంలో ఎకరానికి నూటయాభయి నుండి మూడు వందలే ఉండేది.... ఇక్కడివాళ్ళ అమాయకత్వాన్ని చూసి వాళ్ళు పెరిగిపోయారు. వాళ్ళలో చాలామంది కాలక్రమంలో దొరలుగా రూపాంతరం చెందారు.... సైజాంకు దగ్గరై పన్నులు వసూలు చేసే జాగిర్దార్లు సంపాదించారు.... వాళ్ళకు ఆనందరావు దొర ఎనిమిదో తరం వారసుడు.... అతని తండ్రి రాంరావుదొర నాటికి మమ్మల్ని దోచుకోవడం పూర్తయి నాలుగు తరాలు గడిచినట్టున్నాయి.

"....పోంగ ....పోంగ.... మా వంతు వచ్చేసరికి కొంచెం పెరడు మిగిలింది.... ఎనభై ఏళ్ళ కింద కరువుల్లో తహసీలు కట్టలేక సాగులోకి తెచ్చిన నలభయి ఎకరాల భూమిని వదులుకున్నాడట.... మా తాత. దొరలు పట్వారీలు కల్సి అలాంటి భూములన్నిట్నీ తమ పేరు మీద రాసుకొని వందల.... వేల ఎకరాలకు ఎదిగారు...."

"....ప్రభాకర్ వచ్చి ఊర్లో సంగం పెడ్దామంటే అందరి తీరు నేనూ సంతోషపడ్డాను... ముందువాళ్ళు ఊళ్ళోకొచ్చి డప్పుకొట్టి కొన్ని పాటలు పాడారు.... కొన్ని మాటలు చెప్పారు... కూలీలు.... పాలేర్ల జీతాలు పెంచడం.... వెట్టిరద్దు.... దండుగల దడవతుల వాపసు అన్నాము... అంతదాకా సహాయ నిరాకరణతోపాటు సాంఘిక బహిష్కరణ జరిపాము.... మూడు వందల ఊళ్ళు కదిలి జగిత్యాల్లో జైత్రయాత్ర జరిపాము.... దాంతో రాంరావుదొర కుటుంబంతో సహా పట్నం పారిపోయాడు... కాని ఊళ్ళో పోలీసు క్యాంపు పెట్టించాడు....."

"కౌలు వసూలు కోసం ఊర్లోకి వచ్చిన రాంరావు దొరను దొరికించుకొని చుట్టూ మూగి ప్రజా పంచాయతీ చేస్తే అందరి కాళ్ళు పట్టుకున్నాడు.... పోలీసు క్యాంపు తీసేయిస్తా నన్నాడు. కేసులుపెట్టి మమ్మల్ని కోర్టుల చుట్టూ తిప్పిన ఖర్చులు ముప్పయి అయిదు వేలు మూడు నెలలో యిస్తానని కాగితం రాసిచ్చాడు...."

"....అన్నీ విన్నట్టే విని అయినా యిక ఈ ఊరు రావద్దురో అని అటే పట్నం పారిపోయాడు. కొడుకుల బిడ్డల చదువులన్నీ అక్కడే.... పట్నంలో యిండ్ల ప్లాట్ల వ్యాపారంతో ఎంతో సంపాదించాడు.... ఏదో కొరియర్ సర్వీసు కూడా పెట్టారు.... మా అత్తగారి ఊరి దొర తుక్కారావు పట్నంలో ఏవో ఏజెన్సీల్తో.... డిస్ట్రిబ్యూటర్లుగా ఎదిగారు...."

"....దొరలు దెంక పోంగానే మా కష్టాలన్నీ పోతాయనుకున్నాం.... ఇక అంతా మనదే రాజ్యం అనుకున్నాం.... దొరలు గుంజుకున్న భూములన్నీ మళ్ళీ ఎవరికి వారు దున్నుకోవచ్చను కున్నాం. స్వేచ్ఛగా బతకొచ్చు అనుకున్నాం.... గ్రాంపంచాయతి.... పంచాయతి సమితి... సిసీ బ్యాంకులు.... అసెంబ్లీలు అన్నీ మావే.... అన్నిటామేమే ఉంటామని అనుకున్నాం.... ఇట్లా జరుగుతుందనుకుంటే అట్లా చేసి ఉండేవాల్లం కాదు... ఏమో.... ఎప్పటి ఆపద అప్పుడు గట్టెక్కాలనే ఆలోచన.... రాంరావు దొర దెంకపోయినాక దొరభూమిలో ఓనాడు జండాలు పాతుదాం అన్నాడు ప్రభాకర్... ఆ జెండాలు మా భూమిలో దాకా ఎక్కడ పాతుతారో.... అని అక్కన్నే ఉండాలని ఉన్నాను...."

"....అందర్తో నన్ను తన్నారు.... జైల్లో వేశారు.... ఏమీ చేయని పాపానికే యిన్ని తన్నులా అని రేషం కలిగింది. అవును... యిక అప్పట్నుంచి బేల్మీద బయటకు వచ్చాక అన్నల్తో బాగా కల్సి తిరిగింది నిజమే.... నర్సవ్వ అందరికి రాత్రనక పగలనక అన్నం పెట్టింది నిజమే.... నేనూ నా చెల్లెలూ, పిల్లలూ సద్దులు... ఉత్తరాలు యిచ్చి వచ్చిందీ నిజమే.... నాలుగు ఊర్లల్లో దొరల్ని దొరికిచ్చుకొని కాళ్ళు చేతులు విరగ్గొట్టిందీ నిజమే.... ఆ తర్వాత అందులో ఒకరు దవాఖానాలో చచ్చిందీ నిజమే.... రెడ్డిని ఎన్కౌంటర్ చేసినంక నలుగుర్ని వెంటేసుకుని ఊర్లు తిరిగింది నిజమే.... సంగాలను మల్లా నిలబెట్టిందీ నిజమే... నలభయి ఊర్లల్లో పంచాయతులు చెప్పిందీ నిజమే.... సిద్ధాంత క్లాసులు పెట్టిందీ నిజమే... తుపాకులు పట్టుకొని తిరిగిందీ నిజమే... నక్సలైట్గా మారిందీ నిజమే.... వీటన్నిటి వెనకా ప్రభాకర్ ఉన్నదీ విజమే.... ప్రభాకర్ పై స్థాయిలోకి వెళ్తే ఆ స్థానాన్ని పూరించిందీ నిజమే...."

"....అవును.... గుర్రాల పెంటయ్య అలియాస్ ప్రవీణ్ అని నా పేరు వినగానే దొరలకు పోలీసులకు లాగుల్లో ఉచ్చ రాలింది నిజమే.... నాలుగు తాలూకాలు కలె తిరిగిందీ నిజమే... సారా బందు చేస్తూనే సారా కాంట్రాక్టర్ల దగ్గర లక్షల రూపాయలు పార్టీ ఫండు వసూలు చేసిందీ నిజమే.... వాల్లతో ఎన్నో పనులు వెల్లదీసుకున్నదీ నిజమే.... మాముంగట భయపడ్డట్టు నటించి పోలీసోల్లకు వాల్లు మా జాడలు చెప్పిందీ నిజమే.... మనీ ఆక్షన్ పేరిట దొరల యిండ్లు దోచిందీ నిజమే.... అట్లా నాలుగైదేండ్లు గట్టిగా నిలబడిందీ నిజమే...."

"....అయితే పోలీసులు మా పెరట్లో గొడ్డు గోదలను మేపారు. నర్సవ్వను నీ మొగడేడే వచ్చిపోతున్నాడంటా అంటూ చిత్రహింసలు పెట్టారు. తమ్ముడు లచ్చిరాజం ఆ చిత్రహింసలు, లాకప్ నిర్బంధాలు భరించలేక వీసా తీసుకొని పనిపేరిట అరబ్బు దేశాలకు పారిపోయాడు... నా యిల్లు కూలగొట్టారు... పెళ్ళి కావాల్సిన చెల్లెలు మాలచ్మిని కన్న తండ్రిని... వదినెల్ని గుంజకు కట్టేసి వాళ్ళ కళ్ళ ముందే ఎస్సయితో అయిదుగురు రేప్ చేశారు.... నా తండ్రి మంచం పట్టాడు. రక్తస్రావంతో నా చెల్లెలు చీరెలు విడిచేసేది.... నా కుటుంబం.... పిల్లల బతుకు పల్లేరు కాయలైంది...."

★ ★ ★

అపుడు తెల్వలేదుగానీ నాకిపుడు కడుపులో దేవుతోంది సార్. మాకు యింత అన్నం పెట్టిన కర్మానికి మేంపోయినాక పోలీసులచ్చి యిల్లును ఆడోల్లను ఆగమాగం చేసేవాల్లు. మొగోల్లు చెట్లుగుట్టలు పట్టుకొని ఉరుకుదురు. ఆడోల్లు పసిపిల్లలు ముసలోల్లు గొడ్డుగోద ఎటు ఉరుకాలె సార్. విప్లవం కోసం యివన్నీ భరించాలె అని ఊరడించిన మా ప్రేమలో ఎంత క్రూరత్వం ఉంది సార్. ఏదో

మంచి పని చేస్తున్నారని ఆదరించినందుకు సిద్ధాంతం, విప్లవ వ్యూహం తెలియని వాళ్లంతా ఇన్ని హింసలకు గురికావాలనుకోవడం... ఎంత క్రూరత్వం సార్. వాళ్లను అడిగి విప్లవ వ్యూహం రూపొందించుకున్నామా. ఏదో పెద్ద అన్నలు చెప్తే అదే నిజమని నమ్మితిమి, జనమూ నమ్మిరి. మాకోసమని వాళ్ల పిల్లల వీపులు చిట్లిపోయినై. వాళ్ల పొలాలు బీడులుగా మార్చారు. మేం దొరల భూములు బీడులు వార్చాం. వేల ఎకరాలు బీడు వారిపోయింది. పనిచేసికొని బతికేవాళ్ళు బతుకును వెతుక్కుంటూ ఊర్లు విడిచి దేశాలు పట్టారు సార్. మేం పాపం చేసుకొని పుట్టినాం గనుకనే యిన్ని కష్టాలని మీకు తెల్సుసార్, మేం లేకి కులంలో పేదరికంలో పుట్టినందుకే మాకు శీలం ఉండదని, ఆశలు ఆరాటాలు ఉండకూడదని మీ విశ్వాసం సార్, మీకు తెలియకపోతే మీరు ప్రమాణం చేయించే భగవద్గీత నడగండి సార్. లేకపోతే రాజ్యాన్ని పోలీసుల్ని అడగండి సార్. వాళ్లు చెప్పకపోతే నా భార్యను అడగండి సార్. నా భార్య చెప్పకపోతే నా చెల్లెలు చెప్తది సార్. ఎవరు ఎక్కడ గిచ్చిర్రో, ఏం చేసిర్రో, ఆమె శరీరంలో మిగిలిన జాగలేదు. ఆమె మానంలోంచి కారేది రక్తం కాదు సార్. వాళ్ల ఆనందభాష్పాలు. నేను జైల్లో ఉన్నపుడూ వదల్లేదు సార్.

.......ఈ బాధలు భరించలేను.... ఈ సంసారం వేగించడం నాతోకాదు.... రాత్రి పగలూ ప్రాణాలరచేత పట్టుకొని గుబులు గుబులుగా ఎన్నాళ్ళు బతకడం.... యిట్లా ప్రతిరోజూ చచ్చిపోతూ బతకడం ఎంతకని.... నన్ను కూడా పార్టీలోకి తీసుకుపో అని నర్సవ్వ ఎన్నోసార్లు చెప్పింది.... ఎలాగో జాడదీసుకుని ప్రభాకర్ ముందుంచింది... ఆడవాళ్ళం పిరికివాళ్ళం కాదు... కానీ యీ కుటుంబ జంజాటాలన్నీ ఏంది.... అవి ఎక్కడనన్నా పోనీ... అని అన్నది... ప్రభాకర్ ఈ సమస్య చూసి తన జీవితంలో మొదటిసారిగా గతుక్కుమన్నాడు. నర్సవ్వకు ఏం చెప్పాలో ప్రభాకర్‌కే తోచకపోతే నాకేం తోస్తుంది....

పిల్లల్ని ఎక్కడో వేరే జిల్లాలో ఏదైనా ప్రభుత్వ హాస్టల్లో వేయాలనుకున్నాం.... ఎవరికైనా దత్తత యిచ్చేద్దాం అనుకున్నాం... చెల్లెలు మాలచ్మిని కూడా పార్టీలోకి రమ్మంటే... అంటూ ఆలోచనలు చేశాం.... అయితే మంచానపడ్డ తండ్రి మాటేమిటి.... తండ్రిని అట్లా వదిలేసి చెల్లెలు రానంది... తల్లిని విడిచి ఉండడానికి పిల్లలు ఏడ్చేశారు.... అదీగాక మా పిల్లలు నల్లగా ఉంటారు.... వీళ్ళందర్ని ఎవరు సాదాలి... ఉన్న యింట్లో... మంచి రంగులో మంచి కులంలో పుడ్తే యివన్నీ పరిష్కారం కావడం యింత కష్టం కాదు.... అలాంటివాళ్ళ మీద నిర్బంధం కూడా యింతగా లేదు... మాదిగోల్ల పిల్లలను ముసలి తల్లి తండ్రులను కొడుకులు... ఎంత పార్టీలో ఉన్నా.... ఎవరు దగ్గరికి తీస్తారు. దానికి తోడు ఆశ్రయం యిచ్చినందుకు గురయ్యే నిర్బంధాల భయం ఉండనే ఉంది.... ఇద్దరం ఉన్నప్పుడే చాలని చాత... ఒక్కదాన్తో ఎలా సాధ్యం. మీరే చెప్పండి సార్. మీ భార్య మీ జీతం మీదే ఆధారపడి బతుకుత లేదా సార్... మమ్ముల లాకప్పులో వేస్తే పోలీసులు కొడ్తరని తెల్వదా సార్. పైసలు గుంజుతారని తెల్వదా సార్. నోరు మూసుకుని పండకపోతే నీ మొగున్ని ఎన్‌కౌంటర్ల చంపుతం అని బెదిరించి అలవాటయ్యేది తెల్వదా సార్. మొగన్ని అరుగుమీద కావలి ఉంచి ఇంట్లో ఆడోల్లతో కల్లు దాక్కుంటూ ఏం చేస్తారో! మీకు తెల్వదా సార్.

ఇల్లూ సంసారం... అంతా శిథిలమవుతుంటే వేదనకు గురికాని హృదయం ఉంటుందా... ఉంటే అది హృదయం కాదు... నా కుటుంబం పిల్లల బాగుకోసం అని ప్రారంభమైన నా ప్రస్థానం ఎటుపోతోందో తెలియదు. ఈ త్యాగాల వల్ల నాలాంటి కుటుంబాలేవైనా బాగుపడ్తున్నాయా అంటే అదీలేదు.... అందరూ అష్టకష్టాల్లో నిత్య నిర్బంధంలో కూరుకుపోతున్నవారే... రవంత సుఖం కోసం ఆశపడితే కొండంత కష్టాలు ఎందుకు పడ్డట్టు.... మనసంతా వికలమైపోయింది.... పని చేస్తున్న తృప్తి లేకుండా పోయింది.

"....ఎవరికీ దొరకకుండా ఎంతకాలమని తిరగడం.... మా తోవలు జాడలు పోలీసులక్కూడా తెల్సిపోయాయి. దమ్ము (అలసట) వచ్చినపుడు సేద తీరడానికి చూస్తే విప్లవం అంతూ దరీ లేని ప్రవాహం. నిరంతరం ఈదాల్సిందే. విప్లవానికి అవతల ఒడ్డు యివతలి ఒడ్డూ అంటూ లేవు.... అందులోపడి కొట్టుకుపోవడం తప్ప. కుటుంబాన్ని అలాంటి స్థితిలో వదిలేసి నిర్రందిగా తిరగడం మనిషి లక్షణం కాదనిపించింది. ఎల్లకాలం అలాంటి బతుకు నాతో కాదనుకున్నాను. నా బతుకు నేను బతకాలనుకున్నాను. ప్రభాకర్ ఎన్‌కౌంటరైపోయి.... తెల్సిన యితరులు యితర ప్రాంతాలకు బదిలీ అయిపోయి వేదన తీర్చేవారే కరువయ్యారు.... ఉండేవారు ఉంటారు... పోయేవారు పోతూనే ఉంటారని కొందరు అన్నమాటలు శూలంలా దిగాయి.... అంత యాంత్రికతను, కఠినత్వాన్ని హృదయ రాహిత్యాన్ని జీర్ణించుకోలేకపోయాను. ఆ స్థితిలో సారవ్వను ప్రేమించాను. నా ప్రేమను నిరాకరించినప్పటికీ ఒక చెల్లెలుగా చివరిదాకా నా వేదనలో పాలు పంచుకుంది....

"......బయటకు వచ్చిన నక్సలైట్లలో కొందరికి జీపులిచ్చారు. కొందరు షాపులు పెట్టుకున్నారు. కొందరు కాంట్రాక్టర్లయ్యారు. నేనో హోటలు పెట్టుకున్నాను. మంచి సెంటర్లో మంచి గిరాకీ అయ్యేది.... అయితే పోలీసులు రోజు వచ్చుడు.... తినుడు.... బిల్లు అడిగితే ఏవో కేసుల్లో ఉన్నావని మళ్ళీ కొత్త కేసులు పెట్టడం.... ఏ బందు పిలుపులొచ్చినా యిదే సందు అని తీసుకుపోయి లాకపులో వేయడం....

ఎవరికి చెప్పుకోవాలి... ఎవరున్నారని... నాకోసం మాట్లాడే వారెవరున్నారని... కొంచెం మంచిగా బతికే ప్రతి ఒక్కరినీ పెటీ బూర్జువా అని తిట్టితి. కులపెద్దల్ని కులగజ్జిగాల్లని తిట్టితి. రాజకీయాల్లో తిరిగే వారిని మీవన్నీ దోపిడీ పాలకవర్గాల రాజకీయాలని తిట్టితి. వాల్లు ఓట్లు అడగవస్తే చెప్పుతోకొట్టాలె అని చెప్పితి. వాల్లకు వోటు వేయవద్దని మీటింగులు పెట్టితి. ఇలా అందరికీ కంటయిపోతి. ఎవరితో మంచిమాటుందని... ఇపుడు వాళ్ళు ఎందుకు సహకరిస్తారు సార్.

"....పైగా నేను బయటకు వచ్చాక వారిలో చాలామందికి కొత్త సమస్య లెదురయ్యాయి. వాల్ల రాజకీయాలకు, కులపెద్దరికానికి, వారి పలుకుబడికి ఎక్కడ పోటీ అవుతానో అని వాళ్ళకు గుటగుట తగిలింది. వీడు ఎన్‌కౌంటర్లో ఛస్తే ఎంతమంచిగుండు అని వాల్ల బాధాయె.... ఎందుకు పట్టుకపోయి సంపుతలేరా అని ఆశ్చర్యం.... తమ గుట్టుమట్లన్నీ ఎక్కడ చెప్తాడో అని నాపై లేనిపోనివి కల్పించి పోలీసోల్లకన్నా ముందే వీల్లకే నన్ను లోపల నూకుదామని ధ్యాస.... ఇలాంటివాళ్ళు నాకెలా సాయం చేస్తారు సార్.

".....మల్లా మల్లా పోలీసులు పట్టుకపోవుడు.... తినుడుకు హోటల్ ఎట్లా నడుస్తుంది... హోటల్ తీసేసి కొంత లోను తీసుకొని ఆటో కొన్నాను. వాల్లు రాత్రిల్లు ఆటోల అడ్డా కాడికి వచ్చి.... ఇంట్లుంటె కూడవదలక పనుంది పా అని ఆటోలో ఎక్కి తీసుకపోయి అన్నల జాడ చెప్పుమనిరి.

వాల్ల అనుమానం ఏందంటే నామీద పెట్టిన పద్దెంది కేసుల్లో పదకొండు కేసులు కొట్టేశారు.... నాగోస చూసి పార్టీలో ఉన్న ఆనాటి నా దోస్తులు కొందరు కేసులకు సాక్ష్యాలు రాకుండా కట్టుదిట్టం చేశారు.... అందుకని నాకు యింకా వాల్లతో సంబంధాలున్నాయంటారు....

★ ★ ★

....ఇక్కడ ....ఎన్నితీర్ల కష్టాలో... మేం వాల్ల కన్న తండ్రిని చంపినపుడు కండ్ల ని మూసినవాళ్ళున్నారు.... వాళ్ళకు నేను పార్టీలోంచి వెళ్ళిపోయిన్నన్నా కనికరం ఎందుకుంటుంది... ఇదే సందు అని ఎవలు అడ్డం రారు అని యింకింత ధైర్యంగా సాక్షుల్నీ తయారు చేశారు. పార్టీ ఆదుకొని వాల్లను బెదిరించింది అప్పుడే.... అట్లా కాదని వాళ్ళు నన్ను ఆక్సిడెంటు లాగా చంపాలని చూశారు....

"....సార్ ఈ లొల్లిలో దిగకపోతే నేను ఎపుడో సర్పంచు అయ్యేవాడిని. దొరను చాలా తేలికగా ఓడి(చేవాన్ని. అట్లా ఊరంతా ఉత్సాహంగా ఉన్నపుడు అన్ని పదవులు పోటీలు వదులుకున్నాను.

దాంతో ఎందుకు పనికిరాని పురుషోత్తంరెడ్డి సర్పంచాయె... ఇపుడు బలిసిపోయె... ఈ పిరికిపంద కాల్లు నేను పట్టుకోవాల్సి వచ్చె...."

నాకింద పనిచేసిన నాలెముచ్చు రాజిరెడ్డి అపుడు సర్పంచైపోయె.... ఇపుడు మండలాధ్యక్షుడై పోయె.... రాజిరెడ్డి సరెండర్ కాంగనే బామ్మర్దులు విమానం కాడికిపోయి ముఖ్యమంత్రిని ఎదురుకున్నట్టు వాల్ల పార్టీలకు రారమ్మని పూలదండలేసుకొని పిలుచుకున్నారు... సరెండరయ్యాక కూడా కొందరు అట్లా పెరిగారు. ఇపుడు రాజిరెడ్డిని కలెక్టర్, ఎస్పీ కూడా గౌరవించవట్టిరి. వాడు మీదికి లేవడానికి వాని కులం ఉపయోగపడ్డది. నన్ను అణగదొక్కడానికే నా కులం ఉపయోగపడ్డది సార్.

కులం పెద్దదైతే దొరికితే జేలుకు పంపుతారు. కులం చిన్నదైతే సరెండ్ అవుతామన్నా... నమ్మిచ్చి ఎన్‌కౌంటర్ పేరిట చంపేసిరి.... కులం పెద్దదైతే సరెండర్ కాగానే పనికిరాని నక్సలైటు కూడా ప్రముఖ నక్సలైటవుతాడు.... కులం చిన్నదైతే అంతదాకా ఉచ్చ పోసుకున్న గాడిద కొడుకే ఈ గాడిద కొడుకేనా అని ఉచ్చి పోపిస్తాడు. వాల్లు వరుసమారినా కులం మారలేదు. వాల్లు పార్టీ మారినా పవరు మారలేదు. అయిదువేల కోళ్ళఫారం పెట్టుకున్న రాజిరెడ్డి యిపుడు మండలాధ్యక్షుడాయె... నీ నక్సలైట్ రాజకీయాలు వద్దని చికెన్ సెంటర్ పెట్టుకున్న రామేశ్వర్‌రెడ్డి రెండుసార్లు మంత్రయి పోయాడు. నా బతుకు యిలా అయిపోయింది.... పాలకవర్గాల్లో బంధు మిత్రులున్నోల్లే నక్సలైట్లలోను మంచి బతుకున్నది. వాల్లు పోలీసులకు దొరికినా దొరలాగే మాట్లాడుతారు. చక్కని భాషలో మాట్లాడి అబ్బ ఎంత పెద్ద మేధావి అన్పించుకోగలరు. మాకు అంత భాష రాదు. అంత సిద్ధాంతం రాదు. వస్తే వాల్ల తీరే నేను కూడా చీలిపోయినా అంటూ ఒక పార్టీ పెట్టుకోకపోదునా సార్.

నాతో పనిచేసిన వాల్లు నలుగురు నాలుగు దిక్కులైపోయారు. వేణుగోపాలశాస్త్రి ఏదో దినపత్రికలో సబ్ ఎడిటర్ అయ్యాడు. విశ్వరూపరావు ఏ క్లాసు కాంట్రాక్టరయ్యాడు. ఎమ్మెస్సీ చేసిన ఎమ్మెల్లే బావమరిది కొడుకు తిరుపతిరెడ్డి ఓ ప్రయివేటు కాలేజీకి ఇంఛార్జి ప్రిన్సిపాల్ అయ్యాడు. ఇట్లా ఎవరి కులం తీరు వాల్ల బతుకులు.... ఎవరి చదువు తీరు వాల్ల బతుకులు... సరెండరైనాక కూడా బతుకులు గెల్చుకున్నారు. జీతాలు కుదురుకున్నారు.... నాకేం దొరికింది... ఉన్న జీవితమే కుక్కలు చింపిన విస్తరైపోయింది....

నాకు తెల్సినవాల్లు లేరని కాదు.... మా ఉన్నారు... మా ముత్తవ్వ పొందించిన ఊర్లో పుట్టినవాడే... అచ్యుతశర్మారావంటారతన్ని... అతడికి విప్లవంలో పెద్ద పేరే ఉంది. ఇపుడు పట్నంలో నాలుగు లక్షలు పెట్టి అపార్టుమెంటు కొనుక్కొని పట్నంలో ఉంటున్నాడు. కాని తన తోలు కాపాడుకోవడం ఎట్లానో అతనికి తెల్సినంత ఎవరికీ తెలువది. స్టేట్‌మెంట్ యిచ్చి పేపర్లో తన పేరు చూసుకోగానే అతని ప్రాణం చల్లబడుతుంది. అతడు ఏ కేసు కొసదాకా పట్టించుకున్నాడని.... అతనికి పేరు కావాలి. పేరున్నోల్ల గురించైతే పట్టించుకుంటాడు. మీటింగు పెడ్తాడు. మాలాంటివాల్లకైతే వాల్లు యివన్నీ ఉండేవే గదా.... అని సముదాయిస్తారు. కాని వాల్ల వీపుమీద దెబ్బకాదు గదా.... తలుపుమీద గొల్లెం కొడితేనే పోలీసుల నిర్బంధం నశించాలని దేశమంతా బొబ్బలు పెడుతారు. గవర్నరు ముఖ్యమంత్రులదాకా ఉరుకుతారు... అడిగితే మేం పోలేదు.... మా చుట్టాలు నా భార్యను వాల్ల దగ్గరికి తీసుకపోయారని అంటారు. వాల్ల కులపోల్లు అన్ని పార్టీల్లో ఉన్నారు.... ఇట్లా అరెస్టు కాగానే అట్లా వెంటనే విడుదలయ్యేట్టు ఎన్నో రూపాల్లో పనిచేస్తారు....

........మేం ఛస్తే వాల్లు కవిత్వం రాద్దామని చూస్తారు. అది చూసి మనం చస్తే మనక్కూడా యింతపేరు వస్తుందని నాలాంటోల్లు మల్లా అందులోకి ఉరికి సచ్చుటానికే వాల్లు రాస్తారు. వెనకట రాజులు యుద్ధాలు చేస్తూ యిలాగే వీరగాథలు పాడించి సైన్యాల్లోకి భర్తీ చేసుకునే వారు.... పల్లెల్లో చెప్పించిన పల్నాటి బొబ్బిలి యుద్ధం, మహాభారతం వగైరా వీరగాథలన్నీ అందుకు ఉపయోగించుకున్నవే...

వాల్లకు కావాల్సింది మేం వాల్ల సైన్యంలో చేరడం.... అంతేగాని మేం బతికి ఉంటే పౌరహక్కుల వాల్లయినా విప్లవ రచయితలైనా ఎందుకు పట్టించుకుంటారు సార్.

....నన్ను జేల్లో వేస్తే నా యింటికి పోయి మందలించిన (పరామర్శించిన) వాల్లు లేరు. చదువురాని మాలాంటి నక్సలైట్లను చూస్తేనే వాల్లకు ఉచ్చపడుతుంది. రోడ్లమీద కల్సినా మాట్లాడ నద్దంటారు... ఇంటికి పోతే ఎందుకు వచ్చావంటారు.... నేను వాల్ల యింటికి పోతే వాల్ల మీద నిర్బంధం పెరుగుతుందట... నాతో కలవరు. మాట్లాడరు... కాని వాని ధ్యాసంతా విప్లవం గురించేనట.... విప్లవం అని అన్నా వాల్ల బతుకు పువ్వుల్లో పెట్టినట్లు సాగాలట. వాల్ల ఉద్యోగాలు... వేల జీతాలు... వాల్ల పిల్లల సదువులు... సుఖాలు.... గౌరవాలు అన్నీ భద్రంగానే ఉంటాయి. నేను కోరుకున్నదీ అదే.... మా పల్లెల్లో కూడా విప్లవం చేస్తున్నా కూడా మా వాల్ల బతుకులు అట్లానే సజావుగా సాగే అవకాశాలుండాలని. అది వారికి తప్పయిపోయింది. అది దిగజారుడుతనం అన్నారు. అలా అన్నవాల్లే పార్టీలో పదవి పోగానే హాయిగా ఉద్యోగాలు, వృత్తులు చేసుకొని బతుకుతున్నారు.... కానీ కనీసం వాల్లు ఒక పాలకవర్గ పార్టీ నాయకుడు పట్టించుకున్నట్టయినా... పౌరహక్కుల సంగం పట్టించుకున్నట్టయినా ప్రజల గురించి పట్టించుకోవడం లేదు.... పార్టీలో నాయకత్వాలు ఉన్నంతసేపు మాత్రం నా అంత మొనగాడు లేడన్నట్టు ప్రవర్తిస్తారు... దేకే గుద్ద తనది గాకపోతే కాశీదాకా దేకుమంటారు వీళ్ళంతా... హింసలు దెబ్బలు త్యాగాలు తనవి తన కుటుంబాలవీ కాకపోతే చాలు... అన్ని వ్యూహం ఎత్తుగడలు కరెక్టేనంటారు... నీ అన్నం నాకు పెట్టు. నీకు ఆకలి కాకుండా మందిస్తా నన్నట్టు వాళ్ళు ఇవాళిటి అభివృద్ధినంతా సొంతం చేసుకుంటూ రేపటి అభివృద్ధి మీకంటారు. అందుకు విప్లవించాలంటారు. వాళ్ళు చక్కని చదువులు చదువుకుంటూ తీరొక్క ఉద్యోగాలు వృత్తులు చేసుకుంటూ పిల్లల్ని విప్లవం వాసన అంటకుండా యింగ్లీషు మీడియంలలో చదివించుకుంటూ రోజా పెళ్ళాం పక్కలో పడుకుంటూ అన్ని సుఖాలు అనుభవిస్తూ.... అయిదారేళ్ళు పనిచేసి వచ్చిన నాలాంటి వాళ్ళను దిగజారిపోయాడని వదిరే గాడిద కొడుకులను చెప్పుతో పళ్ళు రాలగొట్టాల. ఏ త్యాగాలు చేయకుండానే విమర్శించే వీళ్ళ పెళ్ళాలను.... బిడ్డలను.... రేప్ చేసినపుడు తెలుస్తుంది....

"....వాల్లు ఇండ్లు కట్టుకుంటారు... పెండ్లాం పిల్లలతో హాయిగా సంసారం చేస్తారు... వాల్లకు మంచి ఉద్యోగాలు కావాల. మంచి కీర్తి కావాలి.... వాల్ల కీర్తికి మా నిర్బంధాలు, మా చావులు సాధనాలుగా ఉండాలే తప్ప.... వాల్లు మమ్ముల్ని వాల్లలాగా బతకాలనుకునే మనుషులుగా చూసిందెపుడు.... ఇలాంటివాల్ల ఉపన్యాసాలు పాటలు విని, వాల్లు రాసే పుస్తకాలు చదివి చెడిపోయాను. అజ్ఞాతసూరీడు కొండపల్లి సీతారామయ్య.... పీవీరావు... ముక్కు సుబ్బారెడ్డి, చెంచయ్య, కళ్యాణ్‌రావు అందరూ యింతే... రేపు గణపతీ... ఆదిరెడ్డీ..... యింతే... అయ్యవారు చెప్పే మీది మాటలు విని తీర్థం పోతే అతడు... గుడిలో.... నేను చలిలో.... అన్నట్టే అయింది. వాల్ల చెల్లెల్లకు, బిడ్డలకు, మరుదళ్ళకు కట్నాలు లేకుండా లగ్గాలవుతాయి. మాకేం వచ్చింది.... వాల్లంతా ఏనుగుల్లాంటోల్లు.... ఏనుగు చచ్చినా పదివేలు బతికినా పదివేలు... వాల్లు పార్టీలో పని చేసినా, బయటకొచ్చినా.... ఎన్‌కౌంటర్లో పోయినా... వాల్లకయ్యే నష్టం లేదు. వాల్లకు దేశంలో పట్టనంత పేరొస్తుంది. వాల్ల పెండ్లాం పిల్లల సాయం కోసం దేశమంతా కదిలివస్తుంది సార్."

ఒకాయన మనుమరాలు పేరుమీద యిరవై లక్షల యిల్లు కట్టుకున్నాడు... నాక్కూడా అజ్ఞాత సూరీడులా ముక్కుసుబ్బారెడ్డిలా కొండపల్లి సీతారామయ్యలా సాదాగా బతకాలని ఉంది. నలభయి ఏండ్లు విప్లవంలో తిరిగి వేలమంది చావులకు కారణమైనవాడు మల్లా సాదా జీవితం జీవించే హక్కుందిగానీ.... నాలుగైదేండ్లు తెల్సీ తెలియక అందులో తిరిగి మల్లా యింటికి వస్తే మాకు సాదాగా బతికే హక్కులేదెందుకు?

"......విప్లవంలో చేరి జీవితాన్ని ఓడిపోయాను. జీవితాన్ని గెలుచుకోవాలని విప్లవంలో చేరితే... విప్లవం నాకు ఓడిపోయే జీవితాన్నిచ్చింది సార్."

★ ★ ★

"....నిర్బంధం పెరగడానికి పెంచడానికి ఎవరి కారణాలు వారికున్నాయి సార్. నిర్బంధం లేకపోతే రిక్రూట్‌మెంటు ఆగిపోతుందని పార్టీల భయం... ఏమంటే ఎంత అవగాహన ఉన్నా నిర్బంధం లేని వర్గాలు కులాలు ప్రాంతాల నుండి రిక్రూట్‌మెంటు పదిశాతమైనా ఉండడం లేదు... అటుచూస్తే నక్సలైట్ల బూచిలేకుండా లక్షలు కోట్లు ఆడిట్ లేకుండా తినడానికి సందు ఎలా దొరుకుతుంది... ఎన్‌కౌంటర్ల పేరిట చంపకపోతే వాళ్లకు పాతపగలు తీరేదెలా.... ప్రమోషన్లు వచ్చేదెలా..... నిర్బంధాలు లేకుండా నిలదీసే అవకాశాలుంటే దోచుకునేదెలా, రేపులు చేసేదెలా... ప్రభుత్వానికి తమ అవినీతి అసమర్థతను సమస్యల్ని పరిష్కరించలేని అలసత్వాన్నించి దృష్టి మళ్ళించడానికి నక్సలైట్ల సమస్య లేకపోతే ఎలా....

.....ఇటు చూస్తే కోస్తాలో కదిలిన లక్షల మందిలో నూటికొకరైనా హోల్‌టైమర్ కాలేదు.... వాళ్లకు బాధలే లేకపోతే మీటింగులకెలా వచ్చారు. వాళ్లకు బాధలున్నాయి. బతికే అవకాశాలూ ఉన్నాయి. అందుకని లీడర్లుగానే తప్ప కేడర్‌గా యిరవై ఏండ్లల్లో యాభయిమందైనా కార్యకర్తలు రాకపోయిరి. ఆ వచ్చిన ప్రతివాడూ "నా మాట మీంచే విప్లవం నడవాలని కోరేవాడే తప్ప.... ప్రజల మాట పట్టించుకున్నదెన్నడు సార్.

".....మేం ఎన్నికల్లో దిగితే తామెక్కడ ఓడిపోతామేమోనని ఎన్నికల్లో దిగవద్దనే మాకు పాలకవర్గ పార్టీ నాయకులు ఎన్ని రకాలుగా సాయం చేశారో.... ఎన్ని దేవుల్లకు మొక్కారో... ఆ దేవుల్లకే ఎరుక.... సామాజిక అన్యాయాల్ని కొంచెం గట్టిగ నిలదీస్తే అన్నల్తో సంబంధా లున్నాయని తన్నించాలంటే నిర్బంధం లేకపోతే ఎట్లా సాధ్యం.... యిట్లా నిర్బంధం ఉండాలని కోరుకోవడానికి ఎవరి కారణాలు వారికున్నాయి...."

కాన్షీరాం మీటింగులకు అయిదు లక్షల మంది వచ్చారు. ఆర్నెల్లు తిరగకముందే అభ్యర్థులకు అయిదువేల ఓట్లన్నా రాలలేదు. నక్సలైట్ల మీటింగులకు పదిలక్షల మంది వచ్చారని నిర్బంధం పెట్టుడేనా సార్. ఓ అయిదేండ్లు అవకాశాలిస్తే దాని అసలు స్థానంలోకి ఎండుకపోతది. మీరే నిర్బంధం నీరుపోసి రోషం నారుపోసి అమాయకులను నక్సలైట్లుగా మార్చుతున్నారు సార్. స్వేచ్ఛ వుంటే అన్ని పార్టీలను నిలదీస్తారు. ఎదురు తిరుగుతారని ఎవరి కారణాలు వాళ్లకున్నాయి సార్.

"....ఈ ఆవుల పోట్లాటలో దూరిన మాలాంటి లేగల కాళ్ళు విరిగాయి. మాకేం మిగిలింది... మాలచ్మి పెండ్లి కోసం నాలుగు దిక్కులు తిరిగి అప్పులు దూసుకవచ్చాను. నేను విప్లవంలో తిరిగినా కట్నం లేకుండా మా చెల్లెను పెండ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. కొందరు విద్యార్థి యువజనుల్ని అడిగాను... ఒక అమ్మాయి ఉంది. వాళ్ళ అన్న విప్లవంలో కెళ్ళాడు. ఆమె పెళ్ళి కావాలి. కొంచెం కుంటి... కొంచెం నలుపు పోలీసుల్తో రేప్ చేయబడింది.... అని మాత్రం చెప్పలేదు. ఏకులమో కూడా చెప్పలేదు. చాలా చక్కగా ఉంటుందనే చెప్పాను. విప్లవం పట్ల చక్కని అవగాహన ఉంది..... మీరెవరైనా పెళ్ళి చేసుకుంటారా అని అడిగాను. వాళ్ళ ఆదర్శాలు మీటింగుల మేరకే. ఆ ఆదర్శాల కనువుగా జీవితాల్ని మలుచుకోవాలని లేదు. వాళ్ళకు బాగా చదువుకొని ఉద్యోగం చేసే భార్యలు కావాలట. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ విప్లవాల గురించి మాట్లాడతారట. అంతేగాని విప్లవంలో ప్రాణాలర్పించినవారి భార్యలను చెల్లెండ్లను కూతుళ్ళను పెళ్ళి చేసుకోరట.... సాది సవరించాల్సిన నాలాంటివాళ్ళు యిల్లు వదిలేసి విప్లవంలో కలిశాక నిత్య నిర్బంధంతో పాటు ఆర్థిక బాధలు మీద పడుతుంటే మా వాళ్ళు చదువుకోవడం ఎలా సాధ్యం.... చదువుకున్నా ఉద్యోగాలు సాధించడం

ఎలా సాధ్యం... ఆ చదువూ ఉద్యోగాలూ... ఇతరుల పాలయ్యాయి. విప్లవంతో పని లేకుండానే యిపుడు వారు హాయిగా బతుకుతున్నారు.....

మా చెల్లెల్ని రేప్ చేసిన విషయం తెల్సీ కొంచెం ఎక్కువ కట్నంతో తల్లీ దండ్రీ లేని పేదవాడు చేసుకోవడానికి ముందుకొస్తే ఎంతో సంతోషించాము. మానవత్వం యింకా బతికే వుందనుకున్నాం. కానీ పెళ్ళి కట్నంతో షాపు పెట్టుకొని ఆ షాపుతో డబ్బూ గౌరవం పెరిగాక మాలచ్మిని వదిలించుకోవాలని చూశాడు.... పోలీసులు చేసిన రేప్ గురించి గుచ్చి గుచ్చి అడిగి వారితో అక్రమ సంబంధాలు అంటగట్టి వేధించడం ప్రారంభించాడు... ఆ బాధలకు తాళలేక బావిలో దూకింది. చావుదప్పి కుంటిదైపోయింది. వాడు వదిలేశాడు... ఆకలి ఆగలేక మాలచ్మి ఎవరికో అలవాటైంది... అది తెల్సీ మళ్ళీ పెళ్ళి చేయలేని నిస్సహాయతతో కుమిలి కుమిలి ఏడ్వడం తప్ప ఏం చేయలేకపోయాను. మొదట అలవాటైన వాడు మోసం చేశాడు... దానికిపుడు తిరుగుబోతు అనే పేరొచ్చింది. లక్షలమంది విద్యార్థి యువజనుల్ని ఆర్గనైజ్ చేసినా వాళ్ళ సంస్కృతిని ఏం మార్చగలిగాం.... వాళ్లల్లో ఏ ఒక్కరైనా మాలచ్మిని పెళ్ళి చేసికొంటే దాని బతుకు యిట్లా మారి ఉండేదేనా.... విప్లవంలో తిరుగుతూ అందరికి అన్నాలు పెడ్తూ చెప్పిన పనల్లా చేసే మాలచ్మిని కులపోల్లు చేసుకోవడానికి భయపడిరి.... అంత తెలివిగల దాన్ని చేసుకుంటే చెప్పినట్టు వినదని. మా మీది నిర్బంధం వాళ్ళ మీద కూడా పడుతుందని మరో భయం.... అన్నీ కల్సి మాలచ్మి బతుకు యిట్లా అయిపోయింది.

★ ★ ★

"...వెనక్కి తిరిగి చూసుకుంటే సాధించిందేమున్నది సార్. నిర్బంధాలకు తాళలేక నర్సవ్వ తల్లి గారింటికి పోయి.... మాలచ్మి అమ్మమ్మ బంధువులింటికి పారిపోయి.... మందులూ అర్సుకునేవాళ్ళు లేక మా నాయిన్న పోయాడు. తమ్ముడు అరబ్బు దేశం నుండి పంపిన పైసల్తో వీసాకోసం చేసిన అప్పులే తీరలేదు.... విప్లవంతో సంబంధం లేకపోయినా తమ్ముడు అరబ్బు దేశం నుండి రాగానే లోపలవేసి చిత్రహింసలు పెట్టి సంపాదించిందాన్లో సగం వాళ్ళే గుంజుకున్నారు. నా ఒక్కడి కారణంగా నావాళ్ళ ఎన్ని కుటుంబాలు పాడైపోయాయి. నేనూ నా వర్గంవాళ్ళూ.... మా కులం వాళ్ళూ విప్లవంలో ఏం బావుకున్నాం....

"....నా పిల్లలు యిక నా మాట వినకుండా అయ్యారు.... వారి తోవ వాళ్ళు చూసుకున్నారు. పెద్దోడు దేవయ్య ఆనందరావు పెట్టిన హోటల్లో జీతానికి కుదురుకున్నాడు. ఆనందరావు కొన్న ప్రయివేటు బస్సుమీద చిన్నోడు కాంతయ్య క్లీనర్‌గా పనిచేస్తున్నాడు.... నా కూతురు ఆనందరావు తమ్ముడు బ్యాంకు ఆఫీసరు యింట్లో స్వీపరుగా పని చేస్తోంది. దొరలే కాపాడుతారనే భరోసాతో అట్లా నిర్బంధం బారి నుండి బయటపడ్డారు.

ఆనందరావు వాళ్ళు ముగ్గురన్నదమ్ములు.... వాళ్ళిపుడు వేర్లుపడ్డారు. భూములు పంచుకున్నారు. రాంరావు దొర గుండెపోటుతో పోయాడు. నేనే కలలో కనపడి గుండె ఆగిపోయిందని బదునాం చేశారపుడు. ఆనందరావు తమ్ముల్లు పట్నంలో చదువుతున్నపుడు యివే సంగాల్తో తిరిగారు. అలా పెద్ద పెద్ద అన్నలంతా వారికి తెల్సు. మా తాత తండ్రులు వెనకట ఎప్పుడో దొరల్లా సాగించుకొని చేసిన తప్పులకు మమ్మల్ని శిక్ష అనుభవించుమంటారా.... అని అడిగి సానుభూతి సాధించారు. మా కోసం కాదు. మా పిల్లల చదువుల కోసం పెండ్లిల్ల కోసం మా భూములైనా అమ్ముకోనీయరా అని అడిగారు. మధ్యవర్తుల ద్వారా పార్టీ ఫండు పార్టీకి చేరేది. కొంత భూమి సంగానికి విరాళంగా వచ్చేది. వాల్లకు అనుమతి లభించేది.

"....అయినా అపుడు అన్నలు భూముల్ని అమ్మనీయనిదే నయమైందని ఆనందరావు.... అతని తమ్ముళ్ళూ అన్నలకు మనసులో జోహార్లు అర్పిస్తుంటారు. ఆనందరావు తమ్ముని పిల్లలు

మాలచ్మితో నన్ను పొగుడుతూ ఉంటారట.... మీ అన్న విప్లవం చేసి మమ్మల్ని ఆ పశువుల రొచ్చు.... బురద పొలాలు.... ఎండల్లో బతికే బాధ తప్పించాడని.... అవును మరి. వాళ్ళిప్పుడు ఏసీల్లో కారునుండి కాలు కింద పెట్టకుండా బతుకుతున్నారు. మా పోరాటం కొత్త బతుకు దోవకోసం కన్నతండ్రే కొట్టి పంపినట్టయి వాళ్ళు కొత్త ప్రపంచాన్ని గెలుచుకున్నారు. బావిలోని కప్పల్లా మా జీవితాలు దృక్పథాలూ కుదించుకుపోయాయి. వెనకట గురుకుల విద్యాభ్యాసం పూర్తయ్యాక రాజు కొడుకునూ మంత్రి కొడుకునూ పది వరహాలిచ్చి రాజు మంత్రి కొడుకులం అని చెప్పుకోకుండా రెండేళ్ళు తిరిగి ప్రపంచాన్ని తెల్సుకొని రమ్మంటే రాజ్యాలే గెల్చుకొచ్చి నట్టుగా.... ఇక్కడి దొరలు పల్లెలు వదిలాక సేట్లయ్యారు. పారిశ్రామిక వేత్తలయ్యారు. కాంట్రాక్టర్లయ్యారు. రాష్ట్ర నాయకులయ్యారు. డాక్టర్లయ్యారు. ఇంజనీర్లయ్యారు. ప్రయివేటు కాలేజీల ఓనర్లయ్యారు. ప్రభుత్వ అధికారులయ్యారు. ఊర్లలోంచి పారిపోయిన దొరలు, వర్గ శత్రువులంతా బాగానే బతుకుతున్నారు. ఎక్కడా వాళ్ల పరువుకూ పవరుకూ భంగం రాలే.... వాళ్ళకు జరిగిన నష్టం ఏముంది. అహంకారం వదులుకొని కొంచెం వినయాన్ని నేర్చుకోవడం తప్ప. ఆనందరావు తమ్ముడు హరిగోపాల్‌రావు దొర యూనివర్సిటీ రీడర్రై పౌరహక్కుల సంఘంలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నాడు. అప్పుడు వాళ్లు అమ్మదామను కున్నప్పుడు ఎకరానికి అయిదు వేలున్న భూమి యిపుడు లక్ష రూపాయలైంది. పార్టీ ఫండు ఎంత యిచ్చినా.... కొంత భూమి ఫ్రీగా యిచ్చినా వాళ్ళకేం నష్టం.....

మద్దునూరు తేజేశ్వరరావు దొర విప్లవం వర్ధిల్లాలని దేవుళ్లకు రోజా కొబ్బరికాయ కొడ్తుంటాడు. పారిపోయి పట్నం వచ్చి వందకోట్లు సంపాయించుకున్నాడు. ఇంకో పదేళ్ళ ముందు విప్లవం వచ్చి ఉంటే వెయ్యి కోట్లు సంపాదించి ఉండేవాన్ని.... ఇంకా ఈ పల్లెల్ని పట్టుకొని ఎందుకు వేలాడుతుంటారని తనవారిని సముదాయించడంతోనే ఇక్కడ భూస్వామ్య వర్గం ఇపుడా వర్గంగా అదృశ్యమై పారిశ్రామిక యాజమాన్యంగా ఎదుగుతోందని చాలామందికి తెలియదు. అంటే నిన్నటి జగిత్యాల పల్లెలు పోరాటంతో... ప్రాజెక్టు నీళ్ళతో.... రాష్ట్రంలో అత్యంత అభివృద్ధి చెందిన నేటి గుడివాడ పల్లెలయ్యాయి. భూస్వాముల్ని చంపడం పోయి ఇన్ఫార్మర్లు వగైరా పేరిట భూస్వామ్యేతరుల్ని కాల్చి చంపడం కూడా దీన్నే స్పష్టం చేస్తున్నది.... అయితే విప్లవ సంస్కృతి కారంచేడు చుండూరుల్లా కులపోరాటాలు జరక్కుండా కాపాడు తున్నది....

తేజేశ్వరరావు దొర అనేదాన్లో ఎంతో నిజం ఉంది. పదేళ్ళ ముందే.... సరిగ్గా చెప్పాలంటే యిరవై ఏళ్ళ ముందే విప్లవం వచ్చి ఉంటే.... రాజకీయార్థిక సాంస్కృతిక సామాజిక రంగాల్లో తెలంగాణా వాటా తెలంగాణాకు దక్కి ఉండేది.... ఆంధ్ర షుగర్స్.... నాగార్జున ఫర్టిలైజర్స్ వంటి సంస్థలెన్నో యిక్కడి దొరలే స్థాపించి కోస్తా వారి దోపిడి విస్తరణను అడ్డుకొని ఉండేవారు.... వారిని అధిగమించి ముందుకు సాగి ఉండేవారు. విద్యాభివృద్ధి యిరవైఏళ్ళ ముందే జరిగి తెలంగాణాలో ఉద్యోగాలన్నీ తెలంగాణా వారికే దక్కి ఉండేవి.... వ్యవసాయం యిరవై ఏళ్ళ ముందే అభివృద్ధి జరిగేది. అపుడు ఇక్కడ తెలంగాణా జిల్లాల్లో రూపొందిన "గుంటూరు పల్లెలు" ఉనికిలోకి వచ్చే క్రమమే ఏర్పడేది కాదు... ఇక్కడ భూస్వాములు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతుంటే ఈ పోరాటాలే ఉండేయి కావు. కోస్తావాళ్ళ ఆధిపత్య విస్తరణ యితరుల పారిశ్రామిక విస్తరణ ఇక్కడి భూస్వాముల అభివృద్ధిని అరికట్టింది. తద్వారా ఇక్కడి భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు చేయాల్సి వచ్చింది........

......సార్! మీరు కోస్తావారే కావచ్చు. జడ్జి హోదాలో ఉన్నారు గనక న్యాయం వైపు ఆలోచించండి సార్. నిజం చెప్పండి సార్ 1956లోనే తెలంగాణా అనేది ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి ఉంటే యీ సమస్యలు వచ్చి ఉండేవా సార్. మీ కోస్తాలాగే ఇక్కడి దొరలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి ఊళ్ళు వదిలి పట్నాలకు తరలిపోయేవాళ్లు కాదా! అపుడు వాళ్లు ఉండుమన్నా ఊర్లో ఉండేవాళ్లా.

భూస్వామ్యం యిలా కరుడుకట్టుకు పోయేదా! తహసీలు దారుకు ప్రమోషన్ వస్తే గిర్దావరుకు తహసీల్‌దారుగా ప్రమోషన్ వచ్చినట్టు, జూనియర్ అసిస్టెంటుకు గిర్దావరుగా అంచెలంచెలుగా ప్రమోషను వచ్చినట్టు - ఇక్కడి దొరలు భూస్వాములు పారిశ్రామికవేత్తలుగా ఎదిగితే మేం కనీస గుమాస్తాలుగా, టీచర్లుగా, కార్మికులుగానైనా ఎదిగి ఉండే వాళ్లం కాదా! కోస్తా కమ్యూనిస్టు నాయకత్వం మా తెలంగాణా పోరాటాల పేరుతో ఎదిగి మా మీదే నాయకత్వంగా మారి ఒక్కటిగా ఉందామని చెప్తే ఏం జరిగింది సార్. మా బతుకును ముంచింది. తెలంగాణాలో వున్న అవకాశాల్ని కోస్తావాల్లే కొట్టుకుపోయారు. బడ్జెట్‌లన్నీ అటే తరలించుకున్నారు. రాజకీయాధికారమూ వాల్లదే అయిపోయింది. ఇపుడు నక్సలైట్ల పేరు చెప్పి మాకు అభివృద్ధిని అందకుండా చేస్తున్నారు సార్!.....

ఏ గడీ కోసం.... ఏ గడీ ఆధిపత్యం కోసం ఉండాలని ఆయనా... పోవాలని మేమూ పోరాటం చేశామో ఆ గడీని యిపుడా ముద్దునూరు దొర ఆ వూరికీ ఆ వూరి స్కూలుకూ విరాళంగా రాసి యిచ్చి తన కృతజ్ఞత.... విజ్ఞత తెలుపుకున్నాడు.... ఆ విజ్ఞతే ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోసం విప్లవపార్టీల్తో ఐక్య సంఘటన కట్టాలని చూస్తోంది... ఇలా ఈ విప్లవ పార్టీలు చెప్పేది వర్గ దృక్పథమైనా ఆచరణలో అగ్రకుల భూస్వామ్య వర్గాన్ని నయా ధనిక పారిశ్రామిక ప్రాంతీయ బూర్జువా పాలకవర్గంగా ఎదిగించడానికి మాత్రమే పరిమితమైంది.

".....నిజం చెప్పాలంటే ఏ కొందరు అహంకారులకో తప్ప దొరలకు యిప్పుడు విప్లవం అంటే కోపం ఎందుకుంటుంది... అప్పుడు ఒక్క పల్లెల్లోనే వాళ్ళుండేది. ఇపుడు పల్లెల్లో వాళ్ళే.... పట్నంలో వాళ్ళే. అన్ని పార్టీలు వాళ్ళవే... మాలాంటి వాళ్ళను ఎట్లా పొగపెట్టి వెళ్ళగొట్టాలో వాళ్ళకు కులంతో అబ్బిన విద్యే.... ఆ వెలమ.... రెడ్డి దొరలే.... విప్లవ పార్టీలక్కూడా నాయకులయ్యారు.... వాళ్ళంతా అచ్చంగా భూస్వాముల పిల్లలు కాదు.... పేదరికం నుండి ఎదిగి అగ్రకుల భూస్వామ్య బూర్జువాగా ఎదగాలనుకుని అగ్రకుల పెటీబూర్జువా నుండి క్రమంగా.... నయాధనిక వర్గ స్వభావాన్ని సంతరించుకున్నవాళ్ళు... కొండపెల్లి మొదలుకొని ఆదిరెడ్డి.... గణపతి దాకా అంతావాళ్ళే.....

".....దొరలు పల్లెల్లోంచి పట్నాలకు పారిపోక ముందు.... పట్నంలోని వ్యాపారాలన్నీ కోమట్లు.... పద్మశాలి... విశ్వబ్రాహ్మణ.... గౌడ... తదితర శూద్రకులాలే చేసుకునేవారు.... ఇపుడు అవి కూడా దొరలపాలే అయ్యాయి.... రెడ్ టెర్రర్ వారిని పాజిటివ్‌గా అంతగా చైతన్యవంతం చేసి అభివృద్ధి సైన్సును కైవసం చేసుకునేందుకు పరిగెత్తించింది... అంబేద్కర్ రిజర్వేషన్ల ద్వారా ఈ నూతన అభివృద్ధినే అభివృద్ధి చెందాల్సిన వర్గాలకు అందాలని కోరాడు.... విప్లవ క్రమం సరిగ్గా దాన్నే అసాధ్యం చేసి అగ్రకులాలకు సుసాధ్యం చేసింది.... నిర్బంధం బరువంతా అభివృద్ధి చెందాల్సిన వర్గాలకు కులాలకు.... అభివృద్ధి అంతా అగ్రకులాలకు పాలకవర్గాలకు ఇట్లా అప్పగించడానికే విప్లవం.... ఈ విషయం అపుడే తెల్సి ఉంటే అందులో చేరి ఉండేవాడిని కాను. ఇపుడా గతంతో లాభపడింది లేకపోగా పీడలా వెన్నాడుతోంది.... ఇరవైఏళ్ళ విప్లవంలో మాకు లాభించిందేమిటి సార్.... ఆత్మ విశ్వాసం తప్ప....

"....సరిగ్గా ఆలోచించే దొరలకు పాలకవర్గాలకు యిపుడు విప్లవం అంటే ప్రేమా భయమూ భక్తీ..... అందుకని అంతగా అవసరమైనపుడు ఎన్‌కౌంటర్ కాకుండా వాళ్ళే కాపాడుతుంటారు..... వాళ్ళకది ఎంతో సులభం... ఆఫీసర్లూ.... పోలీసు అధికార్లూ.... నాయకులూ..... అంతావాళ్ళే.... వాళ్ళవాల్లే.... లేదావాళ్ళు చెప్తే వినేవాళ్ళే....

"....న్యాయమూర్తిగారూ... యిట్లా జరిగిపోయిందని నాకు ఎవరి మీదా కోపం లేదు.... గోడకు కొట్టిన బంతిలా తిరిగి మాపైకే విరుచుకుపడే పోలీసుల మీదా కోపం లేదు.... నా కోపం ఈ పాలకవర్గాల మీదా కాదు... ఇది కోపం కాదు... ఆవేదన.... బాధ... దుఃఖం.... కన్నీళ్ళు.... ఈ చరిత్ర నిర్మాణం యిట్లా ఎందుకు తలకిందులైంది.... ఇరవై ఏళ్ళల్లో మా ఆశలు తలకిందులయ్యాయి. తలకిందులైపోయిన

దొరల ఆశలు ముందుకెట్లా సాగాయి. విప్లవంలో అణగారిన వర్గాల అభివృద్ధి ఎందుకు అసాధ్యమైంది.... ఇట్లా పోరాటఫలితాలు ఎందుకు తిరగబడ్డాయి. ఎంత పోరాటం చేశామనేది ముఖ్యం కాదు.... దాని అభివృద్ధి.... ఫలితాలను ఎంత మేరకు చేజిక్కించుకున్నాం అనేది ముఖ్యం.... ప్రయోగాలు మాపాలు.... ఫలితాలు వాళ్లపాలు.... నిర్బంధాలు త్యాగాలు మాపాలు.... అనుభవాలు నాయకత్వాలు అభివృద్ధి వాళ్ల పాలు.... యిలా ఎందుకవుతున్నదన్నదే నా బాధ.....

"....ఓనా విప్లవ మిత్రులారా.... కాలం గడిచిన కొద్దీ అనుభూతులూ నశిస్తాయి. అనుభవాల చరిత్ర కూడా అదృశ్యమవుతూ ఉంటుంది. వాటినించి పుట్టే దృక్పథాలు మాత్రం ముందుకు సాగుతూనే ఉంటాయి. అందువల్ల చరిత్రంటే దృక్పథాల చరిత్రే.... అందుకే కొత్త అనుభవాల నుండి పుట్టే దృక్పథాల ననుసరించి మనిషి తన చరిత్రను నిరంతరం తిరగరాస్తూ ఉంటాడు.... నావాళ్ళు ఏడుతరాల.... స్పార్టకస్‌ల చరిత్ర తిరగరాయాల్సే ఉంది. అదిట్లా అసమగ్రంగానే ఉంటుంది. అసమగ్రత అనే నిర్వచనం మీ దృక్పథానికి సంబంధించినది....

"....సార్... నా వాళ్ళకు పోరాటం చేయడమే తప్ప..... దాని లాభాలు పొందడం తెలువది. నావాల్లకు రోషం ఆవేశమే తప్ప లౌక్యం తెలువది. లౌక్యం ముందు తుపాకులు ఓడిపోతున్నాయి.... నావాల్లకు చావడం తప్ప బతుకును గెల్చుకోవడం తెలువది.... వేల ఏండ్ల నుండి సకల సరుకులు కళలు సృష్టించిన మా చేతుల్తో వాటిని "మార్కెట్" చేసికొని అమ్ముకోవడం తెలియని అణగారిన కులాలవాళ్ళం...."

"....మా సరుకులు కళలు ప్రపంచాన్ని ఆకర్షించాయి.... దాంతో ప్రపంచం నుండి యిక్కడకు వలసలు దండయాత్రలు సాగాయి. మా సరుకులు తిన్నవాల్లు.... స్వార్థపరులై దేశాన్ని వాల్లకప్పగించారు.... మాకు భాష రాదు.... భావం చెప్పడం రాదు.... మాకు చరిత్ర లేదు.నాది చరిత్ర కాదు.... ఎవరి చరిత్రనో... నాయకత్వాన్నో మోయడమే నా పని....."

"....అటు చూస్తే పోలీసుల బాధ.... యిటు చూస్తే యిన్ఫార్మర్‌గా మారానేమోనని ఆరాలు తీయడం... నిజాయితీని శంకించడం కన్నా చిత్రహింస ఏం ఉంటుంది సార్. ప్రభుత్వాలే భయపడి పోలీసు స్టేషన్లనే పట్నాల్లోకి తరలిస్తున్నారు.... ఎస్సయిలకు మంత్రులకు.... చీటీ రాస్తే.... భయానికో భక్తికో అడిగినంత పైకం పార్టీ ఫండుగా సమర్పించి సగౌరవంగా సాగదోలే స్థితిలో.... అన్నం పెట్టారని.... ఆశ్రయం యిచ్చారని.... అమాయకుల్ని చిత్రహింసలు పెట్టడం ఎందుకు సార్. జైల్లల్లో వేసి కేసుల చుట్టూ తిప్పడం ఎందుకు సార్. భయంతోనే అన్ని పనులు అన్ని పార్టీల నాయకులే చేసిపెడ్తున్నపుడు అభిమానంతో చేయడం తప్పెలా అవుతుంది సార్..... నా భార్య అభిమానంతోనో.... భయంతోనో నాకు తెలియకుండా మళ్ళీ ఒకటి రెండు సార్లు సద్దులు.... సమాచారం మోసినందుకు అంత పెద్ద శిక్షనా సార్.... అటు అన్నలూ నమ్మలేదు.... అదును చూసి పట్టించడం కోసమే అనుకున్నారట సార్.... అందుకే అటు పోలీసులకు, ఇటు నక్సలైట్లకు యిద్దరికి వ్యతిరేకంగా అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో లక్షమందితో నిజామాబాదులో తీసిన ఊరేగింపులో నేను కూడా పాల్గొన్నాను సార్.

".....సార్... ఇపుడు మా అడుగడుగూ.... అనుమానపు నీడల్లో అంచనా వేయబడుతున్నాయి. మా మాటల్లో లేని రెండర్థాల కోసం రెండు పక్షాలూ డిక్షనరీలు తిరగేస్తున్నాయి... సార్... నిత్య నిర్బంధం వల్ల మాలోని మంట చల్లారిపోయింది.... ఈ బతుకు పొగచూరిపోయింది. విప్లవం వండుకునే యింతంత వంటకు స్వేచ్ఛా ప్రాణవాయువు అందక నా యిల్లంతా పొగచూరి పోయింది..... నా చరిత్రంతా మసిబారిపోయింది. ఇపుడు ఈ బతుకంతా నిప్పులేని పొగ.... మా జీవితాలు యిపుడు సగం కాలిన కమురు వాసన..... ఇక్కడ మనుషులిపుడు ఒక్కసారిగ మండి చావరు.... నాకు మరణశిక్ష విధించండి సార్... అటు మంటకూ యిటు బూడిదకూ కాని ఈ బతుకును ఉరితీయండి సార్....

నేను ఒక వ్యక్తిని కాదు.... లక్షలాది కోట్లాది తెలంగాణా నేలతల్లిని.... నా బిడ్డల్నీ చెల్లెల్లనీ మునుపటి దేవదాసీలా వేశ్య అనే బోర్డు మెడలో కట్టి నాకు మరణశిక్ష విధించండి... నా తెలంగాణా కిపుడు స్వేచ్ఛ కావాలి.... మేం రూపొందించుకున్న ఊళ్ళు మావి కావాలి.... మేం అడవి నరికి సాగు చేసిన ఈ సమస్త భూములు మావి కావాలి.... ఈ అభివృద్ధి ఫలాలన్నీ మాకు చెందాలి. మేం అభివృద్ధి చెందాలి. మాకు స్వేచ్ఛ కావాలి. కొంచెం బతుకు మారాలని కోరుకున్న కర్మానికి ఈ సమాజాన్నంతా మార్చే బరువును తలకెత్తిన ఏనుగుపాదాల విప్లవ వ్యూహాల బరువు నుండి కూడా స్వేచ్ఛ కావాలి. మరణశిక్ష మాకు అన్ని స్వేచ్ఛల నిస్తుంది..... అందుకే ఇది నా మరణ వాఙ్మూలంగా నమోదు చేయాలని కోరుతున్నాను..."

".....హ......హహ.... నేను అన్ని ఏర్పాట్లు చేసుకొనే వచ్చాను సార్.... చావవలసినన్ని నిద్రమాత్రలు మింగే ఈ మరణ వాఙ్మూలం యిస్తున్నాను. నా తెలంగాణా తనను తాను ఆత్మహత్య చేసుకుంటున్నది సార్."

"....ఓ నా ప్రపంచ ప్రజలారా..... కాలికమురు కంపు కొడ్తున్న ఈ శవంతో సంభోగాన్ని అరికట్టి మానవత్వాన్ని రక్షించండి..... మా స్వేచ్ఛ సమానత్వం కోసం సహకరించండి."

పెంటయ్య అలియాస్ ప్రవీణ్ కోర్టుహాల్లో అకస్మాత్తుగా పడిపోయాడు.... చివరి అరుపులకు అందరూ గుమిగూడారు.... కోర్టు హాలులో కోలాహలం.... వ్యాన్.... వ్యాన్..... డాక్టర్.... డాక్టర్... ఫోన్.... ఫోన్.... అరుపులు. కోర్టుహాలు కిక్కిరిసిపోయింది. ఆ గడబిడలో న్యాయమూర్తి కలం విరిగిపోయింది.

(రచనాకాలం - డిసెంబర్ 1996)

డిసెంబర్ **1997**
విపుల మాసపత్రిక